
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
సోమవారం 18 మార్చి 2024



విజయోస్తు!

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యాశాఖ
- ఫిజికల్, బయోసైన్స్‌లకు వేర్వేరుగా పరీక్షలు
- సెంటర్ల వద్ద మూడంచెల భద్రత
- 54పరీక్ష కేంద్రాలు... 9,537 మంది విద్యార్థులు..
- ఈసారి ఐదు నిమిషాల వరకు చాన్స్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17: పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలోని 287 పాఠశాలల నుంచి 9,455 మంది రెగ్యులర్ విద్యార్థులతోపాటు 82మంది ప్రైవేటు విద్యార్థులు కలిపి 9,537 మంది పబ్లిక్‌పరీక్షలు రాయనున్నారు. ఇందులో 4,831 మంది బాలురు, 4,624 మంది బాలికలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో మాదిరిగా ఒక్క నిమిషం ఆలస్యంగా కాకుండా ఈ ఏడాది పరీక్ష ప్రారంభమైన 5నిమిషాల లోపు విద్యార్థులు వచ్చినా పరీక్షకు అనుమతిస్తారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఈఏడాది మొత్తం ఏడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌లకు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఈ రెండు పేపర్లకు మాత్రం ఒక్కో పేపర్‌కు గంటన్నర మాత్రమే (ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకే) ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పటిష్ఠమైన ఏర్పాట్లను చేశారు. ఈసారి పరీక్ష కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మాదిరిగా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డ విద్యార్థులను పేపర్ తీసుకొని పంపించకుండా పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రంలోనే ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

టెన్త్ పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో వాసంతి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండ తీవ్రతలను దృష్టిలో ఉంచుకొని కేంద్రాల్లో అవసరమైన మందులతో ఒక ఏఎన్ఎంను వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసింది. కేంద్రాల సమయానుగుణంగా ఆర్టీసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రశ్న పత్రాలను ఇప్పటికే సంబంధిత పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. కేంద్రాలకు సరిపడా జవాబు పత్రాలు, అందుకు అవసరమైన సామగ్రిని ఇప్పటికే జిల్లా విద్యాశాఖ పంపిణీ చేసింది.

మూడంచెల భద్రత...

గత సంవత్సరం సంఘటనల దృష్ట్యా ఈ ఏడాది పరీక్షలను పకడ్బందీగా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. కేంద్రం లోపల సిట్టింగ్ స్క్వాడ్, గేటు బయట పోలీసుల భద్రతోపాటు ఇతరత్ర శాఖల సిబ్బందితో కేంద్రం చుట్టూ తిరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సెంటర్ల వద్ద సీఆర్‌పీసీ 144 సెక్షన్‌ను విధిస్తున్నారు. ప్రశ్న పత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే తెరిచి విద్యార్థులకు సరఫరా అందిచనున్నారు.

వేర్వేరుగా ఫిజికల్, బయో సైన్స్ పరీక్షలు

ఈసారిపదవ తరగతికి 7పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కో పరీక్షను నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మిగతా అయిదు పరీక్షలను 3గంటల సమయంలో నిర్వహిస్తున్నారు. కానీ ఫిజికల్‌సైన్స్ పరీక్షను గంటన్నర (ఉదయం 9.30నుంచి 11గంటల వరకు), బయోలాజికల్ సైన్స్‌కు గంటన్నరపాటు పరీక్షను నిర్వహిస్తున్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి..: డి.వాసంతి, డీఈవో



నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాయాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలి. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీ చేశాం. ఒకరోజు ముందుగానే తల్లిదండ్రులు వారి పిల్లల పరీక్ష కేంద్రాలను గుర్తించి, పరీక్ష రోజు గంట ముందుగానే చేర్చాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాలలోకి అనుమతించారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దు.

సత్వర న్యాయం దిశగా కోర్టులు

- హైకోర్టు జడ్జీలు లక్ష్మణ్, రాజేశ్వరరావు
- నర్సంపేటలో కోర్టుల ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి లక్ష్మణ్

నర్సంపేట, మార్చి 17 : కక్షిదారులకు సత్వర న్యాయం దిశగా కోర్టులు పని చేయాలని హైకోర్టు జడ్జీలు కె.లక్ష్మణ్, నామవరపు రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టును హైకోర్టు జడ్జీలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 1937లో ప్రారంభమైన నర్సంపేట కోర్టుకు ఎంతో ఘనచరిత్ర ఉందన్నారు. ఎంతో అనుభవజ్ఞులైన ప్రతిభగల న్యాయవాదులు ఈ కోర్టులో పనిచేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఈ కోర్టులో అనేక మంది పేదలకు న్యాయం చేకూర్చారన్నారు. కేసులు ఎక్కువ పెండెన్సీ ఉన్న కారణంగా అడిషనల్ కోర్టులు మంజూరు చేశామని, ఇక నుంచి సంవత్సరాల కొద్ది పెండింగ్‌లో ఉన్న అనేక కేసులకు సత్వరమే పరిష్కారం లభిస్తుందన్నారు. న్యాయవాదులంతా ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ప్రతిభను సంతరించుకుంటూ కక్షిదారులకు న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేలా చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు పూర్వకాలపు (పురాతన) భవనాన్ని రెనోవేషన్ చేయించాలని, రికార్డు రూములను సరైన రీతిలో భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని, అదనపు జిల్లా న్యాయస్థానాన్ని నర్సంపేటకు మంజూరీ చేయాలని హైకోర్టు జడ్జీలను కోరగా సానుకూలంగా స్పందించారు. నర్సంపేట కోర్టులో గత 30సంవత్సరాలుగా పని చేస్తున్న సీనియర్ న్యాయవాదులను హైకోర్టు జడ్జీలు సన్మానించారు.

కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగరావు, జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, హన్మకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, సబ్‌జడ్జి సాయికుమార్, జూనియర్ సివిల్ జడ్జి శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, కార్యదర్శి సిలువేరు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పుట్టపాక రవి, సీనియర్ న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, కొడిదెల సంజయ్‌కుమార్, తండా సారంగపాణి, తొగరు నర్సింహారెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, షేక్ రహీమొద్దీన్, మోటూరి రవి, పొనుగోటి అజయ్, కోడెం శ్రీధర్, జన్ను మహేందర్, టి.సునీత, రంగనాథస్వామి, గూళ్ళ ప్రభాకర్, మంకలి ప్రభాకర్, తిరుమల్ చౌహాన్, బొడ్డుపల్లి అజయ్, టి.స్రవంతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కోర్టు ఆవరణలో హై కోర్టు జడ్జీలు లక్ష్మణ్, రాజేశ్వరరావులు మొక్కలు నాటారు.

ఆదివారం ఉష్ణోగ్రతలు	
గరిష్టం : 34.0°C	కనిష్టం : 23.5°C

రంజాన్ వేళలు		
ఇఫ్తార్ :	సోమవారం	సా : 6.32 గం..
సహర్ :	మంగళవారం	ఉ : 5.00 గం..

'మిర్చి రైతులారా.. వర్షాలు పడొచ్చు'

వరంగల్ సిటీ, మార్చి 17: రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణం కేంద్రం తెలిపినందున మిర్చి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మిర్చి సరుకులు అధిక మొత్తంలో వస్తున్నందున అడ్తిదారుడిని సంప్రదించి వారి సూచనల మేరకు మిర్చి మార్కెట్‌కు తీసుకుని రావాలని సూచించారు. ఒక వేల సరుకులు తీసుకువచ్చిన రైతులు ఖచ్చితంగా మిర్చి బస్తాలను షెడ్ల కిందనే వేసుకోవాలని పేర్కొన్నారు.

కాషాయ గూటికి అరూరి

- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే రమేష్
- హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి సమక్షంలో చేరిక
- బీజేపీ వరంగల్ లోక్ సభ అభ్యర్థిగా గ్రీన్‌సిగ్నల్?

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అరూరి రమేష్ బీజేపీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఆయన బీజేపీలో చేరడంతో ఇన్నిరోజులు పార్టీ మార్పుపై కొనసాగిన హైడ్రామాకు తెరపడింది. అరూరి బీజేపీలో చేరికతో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ ఖాయమని తేలింది. అరూరితో పాటు సుమారు 500 మంది కార్యకర్తలు కూడా బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా నాయకులు గంట రవికుమార్, నాయకులు డాక్టర్ కాళీప్రసాదరావు, సత్యపాల్‌రెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

అయితే అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన అరూరి ఓడిపోయారు. ఆ తర్వాత వరంగల్ ఎంపీ స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ టికెట్ ఇచ్చే విషయంలో అధిష్ఠానం సానుకూలంగా లేకపోవడంతో బీజేపీ వైపు మొగ్గుచూపారు. బీజేపీ అధినాయకత్వం కూడా ఆయన రాకను స్వాగతించారు. వరంగల్ లోక్‌సభ నుంచి పోటీకి సూత్ర ప్రాయంగా గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది. బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్న అరూరి.. విలేకరుల సమావేశంలో ప్రకటించేందుకు సిద్ధమవుతుండగా అనూహ్యంగా బీఆర్ఎస్ నాయకులు ఆయన గృహానికి వచ్చి బీజేపీలో చేరవద్దని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అనడంతో ఆయనను బలవంతంగా కారులో ఎక్కించుకొని హైదరాబాద్‌కు తరలించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎదుట హాజరుపరిచారు. కేసీఆర్ సైతం బుజ్జగించే ప్రయత్నం చేశారు. వరంగల్ లోక్‌సభ నుంచి పోటీకి అవకాశం ఇస్తామని కూడా ఆశ చూపారు. పార్టీ కార్యాలయం నుంచి బయటకు రాగానే వరంగల్ లోక్‌సభ స్థానానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతు రు కడియం కావ్యకు టికెట్ ఇచ్చినట్టు ప్రకటించారు. దీనిని మరింత అవమానంగా భావించిన అరూరి.. బీజేపీలో చేరడానికి గట్టిగా నిర్ణయం తీసుకున్నారు.



అరూరి రమేష్‌కు బీజేపీ కండువా కప్పుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వాస్తవానికి రెండు రోజుల కిందటే ఆయన బీజేపీ లో చేరాల్సి ఉంది. కిషన్ రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో చేరేందుకు సిద్ధం కాగా, హైదరాబాద్‌లో ప్రధాని మోదీ రోడ్డుషో దృష్ట్యా వీలు పడలేదు. దీంతో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకు న్నారు. ఎట్టకేలకు కొద్ది రోజులుగా అరూరి రమేష్ పార్టీ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్షన్‌కు తెరపడింది. ఈ సందర్భంగా రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అన్నివర్గాల అభివృద్ధితో పాటు 30యేళ్ల పోరాటం తర్వాత మోదీ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ అందుబాటులోకి వస్తోందని, అందుకే తాను బీజేపీలో చేరానని తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశ భద్రత పటిష్ఠంగా ఉంటుందన్నారు. పదేళ్లు ఆయన దేశాన్ని బ్రహ్మాండంగా పాలించాడన్నారు. అవినీ తిరహిత పాలనంతో దేశం ముందుకు పోతోందని కితాబు ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కోడ్ ఉల్లంఘించొద్దు..

- ఉల్లంఘనపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి
- ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17: జిల్లాలో కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ కోడ్ ఉల్లంఘించొద్దని, భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝాతో కలిసి కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వస్తుందని, 18నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రుటిని, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని వెల్లడించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్స్‌లలో ఓటరు జాబితా, సవరణ, తుది ఓటరు జాబితా ప్రకారం 18 లక్షల 16వేల 543 మంది ఓటర్లు, 977మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకొని పేరులేని వారు ఏప్రిల్ 15వ తేదీలోగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్‌విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి లభిస్తుందన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలి..

కోడ్ ఉల్లంఘనపై 1950 టోల్‌ఫ్రీ నెంబరు, 0870-2530811 కాల్ సెంటర్ ద్వారా, సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీ విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల గడువులో అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటాని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు 24గంటల కాల్ సెంటర్ పని చేస్తుందన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ : సీపీ

ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో నాల్గవ విడతలో పోలింగ్ జరుగుతుందని సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేరకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణించరాదన్నారు. తనిఖీల్లో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పిస్తేనే గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని సీపీ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో శ్రీనివాస్, డీపీఆర్వో అయూబ్ అలీ, ఆర్డీవోలు సిడాం దత్తు, కృష్ణవేణి పాల్గొన్నారు.


నేటి ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

పదవులపై పెదవి విరుపు

కీలక నేతలకు, సీనియర్లకు దక్కని నామినేటెడ్ పోస్టులు

- మంత్రుల నియోజకవర్గాల్లోని నేతలకు ఝలక్
- వరంగల్ తూర్పు, ములుగు, భూపాలపల్లి నేతలకు నిల్
- ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలోని నేతలకు నిరాశే..
- ఇక జిల్లా స్థాయి పదవులపైనే ఆశలు



వరంగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల పంపకం నేతల్లో అసంతృప్తి రగిలిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన నేతలకు, సీనియర్లకు నామినేటెడ్‌లో గుర్తింపు దక్కలేదనే ఆవేదనలో ఉన్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవటంపై కాంగ్రెస్ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టికెట్ త్యాగం పేరుతో కొందరికే పదవుల ఇచ్చారని, మిగతా వారికి గుర్తింపేదని ఆందోళనలో కొందరు నేతలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తే.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కేవలం నలుగురికి మాత్రమే పదవులు లభించటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు కాంగ్రెస్ జెండా మోసిన తమకు ఇంకెప్పుడు గుర్తింపని కాంగ్రెస్ నేతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

ముగ్గురికే పదవులు

కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావటంతో చాలామంది సీనియర్ కాంగ్రెస్ నేతలు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన నేతలు, ప్రొటోకాల్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలు అనేక మంది వీటిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే గత శనివారం రాత్రి 37మందితో నామినేటెడ్ పదవులను ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రెండు డజన్లకుపైగా ఆశావాహులు ఉంటే.. కేలవం ముగ్గురికి మాత్రమే పదవులు దక్కాయి. దీంతో చాలామంది నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పరకాల టికెట్ ఆశించి భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ పదవి దక్కింది. వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్యనాయక్‌కు గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, అయిత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అయితే పోదెం వీరయ్య ములుగు జిల్లా వాసి అయినప్పటికీ భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో పోదెం వీరయ్య పోస్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖాతాలోకి వెళుతుందని, అలాగే అయిత ప్రకాష్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని మల్హర్ మండలంకు చెందిన నేత. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఆయనకిచ్చిన పోస్టు

మిగతా 7వ పేజీలో..



గంజాయి మత్తులో యువత

- పొరుగు రాష్ట్రాల నుంచి నగరానికి పెద్దఎత్తున దిగుమతి
- ప్రముఖ విద్యా కేంద్రాల్లో గుట్టుగా విక్రయాలు
- కట్టడి చేయడంలో ఖాకీలు, ఎక్సైజ్ శాఖల నిర్లక్ష్యం

వరంగల్ క్రైం, మార్చి 17: వరంగల్ నగరంలో గంజాయి గుప్పుమంటోంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న గంజాయి ప్రముఖ విద్యా సంస్థలు కేంద్రంగా చేసుకుని విక్రయిస్తున్నట్లు తెలిసింది. గంజాయి సేవిస్తే ఆరోగ్యం పాడవుతుందని తెలిసి మరీ యువత ఈ మత్తుకు బానిసవుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మత్తును యువత ఆస్వాదిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలో సంపన్నుల పిల్లలు ఎక్కువగా ఉంటున్నారు. ఉన్నత విద్యాసంస్థల హాస్టల్స్‌లో ఉండే యువత ఎక్కువగా వినియోగిస్తున్నట్లు అధికారిక సమాచారం. యువతను టార్గెట్ చేసుకుని నగరంలో లక్షల్లో గంజాయి దందా సాగుతోంది. గంజాయి విక్రయాలను కట్టడి చేయడంలో ఖాకీలు వైఫల్యం చెందారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అప్రమత్తం కాకుంటే వరంగల్ నగరం మరో పంజాబ్ అయ్యే ప్రమాదం ఉంది.

పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి

పొరుగురాష్ట్రాలైన ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి మీదుగా పెద్దఎత్తున గంజాయి వరంగల్ నగరానికి చేరుకుంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్డు మార్గాన రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీనితో ఈదందా చేసే వారు రైలు మార్గాన్ని ఎంచుకున్నారు. ఒరిస్సా, విశాఖపట్నం నుంచి వచ్చే దళారులు రైలులో గుట్టు చప్పుడు కాకుండా లక్షల్లో గంజాయిని నగరానికి చేర్చుచున్నారు. ఈ వారంరోజుల్లోనే దాదాపు రెండువందల కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. నామమాత్రపు తనిఖీలతోనే ఈ మేరకు పట్టుకుంటే ఇంకా ఏ మేరకు రాష్ట్రానికి చేరుకుంటుందో ఊహించుకోవచ్చు. రాష్ట్రం చేరుకుంటున్న గంజాయి ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ చేరుచున్నట్లు తెలిసింది.

కాగా గత సంవత్సరం (2023) వరంగల్ నగరంలో పోలీసులు పట్టుకున్న గంజాయి 417 కేజీలు కాగా, దీనివిలువ రూ.1కోటి 4లక్షల 42వేలు. ఈ యేడు మూడు మాసాల్లో పట్టుకున్న గంజాయి జనవరి 48.86 కేజీలు కాగా, దీని విలువ రూ.12లక్షల 22వేలు. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో 17.5కేజీల గంజాయి పట్టుకోగా దీని విలువ రూ.4లక్షల 38వేలుంటుంది. ఈ లెక్కలు గమనిస్తే నగరంలో గంజాయి దందా ఏధేచ్ఛగా సాగుతున్నట్లు స్పష్టమవుతుంది.


పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

విద్యార్థులే లక్ష్యంగా..

వరంగల్ నగరంలోని యువత మత్తులో మునిగిపోతున్నారు. వందల కిలోల గంజాయి నగరానికి చేరుతుండటం గమనిస్తే యువత ఏ మేరకు దీనికి బానిసలయ్యారో తెలుస్తోంది. నగరానికి వస్తున్న గంజాయిని పొడి చేసి సిగరెట్లు, చాక్లెట్ల రూపేణా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కేజీ గంజాయి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుందని తెలిసింది. దళారులు 10గ్రాములు, 20గ్రాముల చొప్పుల ప్యాకెట్స్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. 10గ్రాముల ప్యాకెట్ రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక సిగరెట్ గంజాయి దమ్ము లాగిస్తే ఆరు బీర్లు తాగినంత నిషా వస్తుందని వైద్యులు చెబుచున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నిషాను యువత పొందుతున్నారు. ప్రముఖ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే యువత గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ రహదారి వెంట ఉన్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. రింగ్‌రోడ్డు పరిసరాల్లో విద్యార్థులు గంజాయిని సేవిస్తే పట్టుబడుతుండగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నట్లు సమాచారం. ఇటీవల ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు విద్యార్థులు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు తెలిసింది. సంపన్నుల పిల్లలుగా గుర్తించి హెచ్చరించి పంపినట్లు తెలిసింది. ఇలా నగర కళాశాలల్లో ఈ దందా భారీగానే సాగుచున్నట్లు అధికారిక సమాచారం.

సోమనర్సయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకుడు సముద్రాల సోమనర్సయ్యకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'అన్ అనాలసిస్ ఆన్ ఆంత్రోపోమెట్రిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఫిజికల్ కాంపోనెంట్స్ ఎమాంగ్ జూనియర్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ రిలేషన్ టు దెయిర్ పెర్మార్మెన్స్'అనే అంశంపై వరంగల్ కిట్స్ కళాశాల ప్రొఫెసర్ పి. రమేశ్‌రెడ్డి పర్యవేక్షణలో సోమనర్సయ్య డాక్టరేట్ పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలానికి చెందిన సోమనర్సయ్యను కేయూ ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.రామనాథ్‌కిషన్, బీవోఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రవికుమార్, కేయూ ఫిజికల్‌ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఏటీబీటీ ప్రసాద్ అభినందించారు.

విచక్షణ కోల్పోకు..
విధిరాతను చెరపనీకు..

- పరీక్షల సమయాల్లో ఒత్తిడికి గురికావొద్దు
- ఇష్టపడి చదివితే అంతా సులభమే..
- విద్యార్థులూ.. ఆత్మన్యూనత భావాన్ని విడనాడాలి



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 : తీవ్రమైన పోటీ ప్రపంచంలో విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోతూ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. క్షణికావేశంలో బలవన్మరణాల పాలవుతున్నారు. పరీక్షల సమయాల్లో తీవ్ర మనోవేదనకు గురువుతున్న కొంతమంది విద్యార్థులు.. విచక్షణను కోల్పోతూ వారి తలరాతను వారే చెరిపేసుకుంటున్నారు. విద్యార్థులెప్పుడు ఇష్టపడి చదివితే సంక్లిష్టమైన సందర్భాలు కష్టపడకుండానే దాటేయవచ్చునని విద్యారంగ నిపుణులు, మనోవికాస నిపుణులు చెబుతున్నారు. మార్కులే పరమావధిగా కాకుండా విజ్ఞానం కోసం మాత్రమే చదువుతున్నామనే జిజ్ఞాసను విద్యార్థులు అలవర్చుకోవాలని వారు సూచిస్తున్నారు. విజయావకాశాలకు దారులు వెతుక్కుంటూ ముందుకు సాగాలని వారు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై అనవసరపు భారాలను మోపవద్దని వారు హెచ్చరిస్తున్నారు. సానుకూల దృక్పథంతో చుదువుకునే వాతావరణంలోకి విద్యార్థులను తీసుకొని రావాలని హితబోధ చేస్తున్నారు. ఇంటర్ విద్యార్థిని సాహిత్య మృతి, గతంలోనూ అనేక మంది విద్యార్థులు మార్కులు బాగా రాలేదని, పాస్ కాలేదని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. ఇంటర్ పరీక్షలతో పాటు సీబీఎస్‌ఈ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని కోల్పోవద్దని 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఒత్తిడికి లోనుకావొద్దు.. మనోధైర్యాన్ని కోల్పోవద్దు..

విద్యార్థులెప్పుడు వారి సామర్థ్యాల మేరకు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు చదువుకోవాలి. ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంలో మందుకు సాగాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను ఎంచుకునే ముందుగానే అందుకు తగిన శ్రమ, ప్రయాసలను బేరీజు వేసుకొని అందుకు అనుగుణంగా వారి మానసిక పరిస్థితిని సిద్ధం చేసుకోవాలని వారు చెబుతున్నారు. పరీక్షలంటే విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రదర్శించుకునే వేదికలుగా గుర్తించాలి. గెలుపోటములను సరిసమానంగా తీసుకునే మనోసిద్ధిని కలిగి ఉండాలని వారు సూచిస్తున్నారు. నిర్ధేశించుకున్న లక్ష్యాలను దరిచేరకపోతే ప్రత్యామ్నాయ లక్ష్యాల వైపు దూసుకెళ్లాలే తప్ప ప్రాణపరిహారం చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా సందర్భంలో ఒత్తిడికి లోనైతే ఆ విషయాలను స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకొని ఊరట చెందాలంటున్నారు.

భారాలను మోపొద్దు.. తీరాలకు చేర్చొద్దు..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై తీవ్రమైన భారాన్ని మోపొద్దని మనోవికాస నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాల మేరకు, వారికి ఇష్టమైన కోర్సుల్లో మాత్రమే చేర్పాలని చెబుతున్నారు. తల్లిదండ్రుల కోరికలను వారి పిల్లలపై రుద్దుతూ వారి మనోనిబ్బరాన్ని కోల్పోయేలా చేసే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పద్ధతులు మార్చుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల మేథస్సును ఇతరులతో ఎప్పుడూ పోల్చవద్దని సూచిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేథస్సును వెలికి తీస్తూ వారి ఇష్టాల మేరకు విద్యాబుద్ధులు చెప్పించాలే తప్ప తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని చెబుతున్నారు. విద్యార్థులను విమర్శించకుండా వారిని సక్రమమైన దారుల్లో పెట్టేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలంటున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా మెలగుతూనే వారిలో లక్ష్యాలను చేరుకునే తృష్ణను రగించాలని సూచిస్తున్నారు. జీవితంలో విఫలమై విజయాలు సాధించిన వారి వివరాలను విద్యార్థులకు కథలుగా చెప్పాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు. విద్యార్థుల్లో ఉండే ఆత్మన్యూనత భావాలను తొలగించేందుకు నిష్ణాతులతో అవగాహన కల్పించాలని అభిప్రాయపడుతున్నారు.

సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి

డాక్టర్ బరుపాటి గోపి, మనోవికాస నిపుణుడు



విద్యార్థులందరూ ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలను అంచనా వేస్తూ సానుకూల వాతావరణంలో చదువుకునేలా వారిలో ఒత్తిడిని దూరంచేయాలి. మార్కులకు బదులుగా విద్యార్థులకు విజయావకాశాలకు దారులను చూపేందుకు కృషి చేయాలి.

దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫీజు గడువు 4

కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ మొదటి, రెండో, మూడో ఏడాది బీఏ, బీకాం, జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో 2022-2023 వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పరీక్షల కోసం తమ ఫీజులను ఏప్రిల్ 4వ వరకు ఎలాంటి అపరాధరుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో, మూడో ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులకు, అలాగే ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు తమ ఫీజులను చెల్లించుకోవాలని తెలిపారు. అన్ని పేపర్లకు రూ.600, రెండు పేపర్లకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ ఒక్కో పేపర్‌కు రూ.300 చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లించిన చలనా, ఫొటో, ఫెయిలైనమెమో జతచేసి దూరవిద్యకేంద్రంలో అందచేయాలన్నారు.

పల్లెపాడు దామోదర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కాశోజీ జంక్షన్, మార్చి 17: వినియోగదారుల ఉద్యమంలో సామాజిక సేవ కార్యక్రమాలు 30ఏళ్ల పని చేస్తున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. 17వ తేదీన చెన్నైలో జరిగిన నేషనల్ కన్వెన్షన్‌లో ఛైర్మన్ అనంత్‌శర్మ చేతులమీదుగా మెడల్ అందుకున్నారు. డాక్టర్ పల్లెపాడు దామోదర్ మూడు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా తూనికలు, కొలతలు జరిగే మోసాలపై, బంగారం కొనుగోలులో హాల్‌మార్క్, బీఐఎస్ ప్రాముఖ్యతపై, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్‌పై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారులకు పటిష్టమైన రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన 2019 వినియోగదారుల చట్టం అమలు కోసం దక్షిణాది రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కృషికి గాను జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపాండే, ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, సీసీఐ జనరల్ సెక్రటరీ సాంబరాజు చక్రపాణి, సీసీఐ తెలంగాణ ప్రెసిడెంట్ ఎం.సుదర్శన్, వినియోగదారుల జాతీయ కన్వెన్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే



రుద్రేశ్వరాలయంలో జస్టిస్ అరాధేతోపాటు ఇతర న్యాయమూర్తులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సతీసమేతంగా సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వర్తింపచేశారు. జస్టిస్ ఆరాధే వెంట హైకోర్టు జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్, జిల్లా పోర్టుపోలియో జడ్జి, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్, హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కోక రాధాదేవి, హనుమకొండ జిల్లా కోర్టు జడ్జి ఎం.క్రిష్ణమూర్తి వేయిస్తంభాల గుడికి విచ్చేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితుడు గంగు మణికంఠ శర్మ పూర్ణకుంభంతోస్వాగతం పలికారు. మంగళవాయిద్యాలతో ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఆలయ నాట్య మండ పంలో తీర్థ ప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలను అందచేశారు. వేద ఆశీర్వచనం చేశారు.

వరంగల్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆ తర్వాత పునరుద్ధరించి కల్యాణ మండ పాన్ని తిలకించారు. జస్టిస్ ఆరాధే సందర్శకుల డైరీలో వేయిస్తంభాల గుడిని ఒక అద్భుతమైన కట్టడంగా అభివర్ణించారు. కాకతీయులు కళా రాధకులని, 800 యేళ్ల కిందట నిర్మించిన ఇలాంటి దేవాలయం ఈతరం వారు కూడా తరించడం గొప్ప అదృష్టమని, ఆలయాన్ని సందర్శించడం తనకు గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటయ్య, అర్చకుడు ప్రణవ్, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ నిరంజన్ దేవాదాయ శాఖ సిబ్బంది ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నాగిరెడ్డి మాట్లాడుతూ... ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం డీఏలను మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరైన మౌలిక వసతులతో పాటు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి కనీస వసుతుల ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఈనెల నుంచి ఉద్యోగ విరమణలున్నాయని, ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బెనిఫిట్లను సత్వరమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ, నాయకులు బిల్ల సుబ్బారావు, రమేష్, లక్ష్మయ్య, కుమారస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి స్త్రీవాద రచయిత చలమే..

- అన్నిట్లో స్త్రీ, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలి
- డాక్టర్ అంపశయ్య నవీన్.. ఐదు గ్రంథాల ఆవిష్కరణ
- ఘనంగా రుద్రమ ప్రచురణల దశాబ్ది వేడుకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో మొదటి స్త్రీవాద రచయిత చలమేనని, అన్ని విషయాలలో స్త్రీలు, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలని ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠ శాలలో ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈఐదు గ్రంథాల ఆవిష్కరణలను ఐదు సమావేశాలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిశెట్టి రజిత, కొమ్రాజు రామలక్ష్మి నిర్వాహకులుగా వ్యవహరించారు. మొదటి సమావేశంలో చిమమండ న్గోజి అడిచే గ్రంథాన్ని డాక్టర్ అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఇలాంటి పుస్తకాలు చదివితే స్త్రీల విషయంలో అభిప్రాయాలు మారుతాయని అన్నారు. పుస్తకాన్ని మెట్టు రవీందర్ పరిచయం చేశారు. రెండో సమావేశంలో తమ్మెర రాధిక హవేలీ దొరసాని కథా సంపుటిని బీవీఎన్ స్వామి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాధిక కథలో ప్రత్యేకత కనిపిస్తుందని, విభిన్న వస్తువులతో వాస్తవిక దృక్పథం ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని మాలతీలత పరిచయం చేశారు. మూడో సమావేశంలో భార త దేశంలో వితంతు వ్యవస్థ అనే గ్రంథాన్ని ఆవిష్కరించిన తిరునగరి దేవకీదేవి దేశంలోని వితంతు దుర్భర పరిస్థితులను వివరించారు. తెన్నేటి విజయచంద్ర పుస్తకాన్ని పరిచయం చేశారు. నాలుగో సమావేశంలో తమ్మెర రాధిక మరొక గ్రంథం కాలం జాడలు తీస్తూ.. కవితా సంపుటిని ఆవిష్కరించిన పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాధిక కవిత్వంలో మానవ సంబంధాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని చంద్రకళ పరిచయం చేశారు. ఐదో సమావేశంలో అని శెట్టి రజిత కాలం కాన్వాస్ మీద కతా సంపుటిని ఆవిష్కరించిన వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. అనిశెట్టి రజిత కాన్వాస్ పెద్దదని, ఆమె కవిత్వంలో వస్తు వైవిధ్యం తాత్వికత ఉంటుందన్నారు. ఈపుస్తకాన్ని సింగరాజు రమాదేవి పరిచయం చేశారు.

ఈ సమావేశంలో నాగిల్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, నిధి, పల్లె శ్రీను, బి.రమాదేవి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, పల్లేరువీరాస్వామి, బిల్ల మహేందర్, నేరేళ్ల శ్రీనివాస్ సౌహార్ద్ర సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కొమ్రాజు రామలక్ష్మి ముగింపు వ్యాక్యాలు పలికిన ఈ సమావేశాలలో కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, కళాకారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొర్రెలకాపరిని కాటేసిన పాము

- పామును సంచిలో వేసుకుని ఆస్పత్రులకు పరుగులు
- అది ఏ పామో తెలియక చికిత్స చేయని వైద్యులు



సంచిలో పామును వేసుకుని ఎంజీఎం ఆస్పత్రికి వచ్చిన రాజెల్లు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 : పాము కాటుకు గురైన గొర్ల కాపరి కాటేసిన పామును తీసుకుని వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగ్గా, అది ఏ పామె తెలియక వైద్యం చేయని ఉదంతం వరంగల్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు నక్క రాజెల్లు కథనం ప్రకారం... వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన గొర్ల కాపరి నక్క రాజెల్లు రోజులాగే చెరువులో గొర్లను కాస్తున్నాడు. ఎంత ఎక్కువగా ఉండడంతో ఓ చెట్టు కింద సేద పడుకున్నాడు. చెట్టుపై నుంచి గుర్తు తెలియని పాము కింద పడింది. పామును గమనించిన ఓ గొర్రె దానిపై దాడి చేయడంలో పాము గొర్లకాపరి చేతిపై కాటు వేసింది. దీంతో అతడు పామును చంపి, దానిని ఓ సంచిలో వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వైద్యం కోసం వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు ఓ ఇంజక్షన్ వేసి గ్లూకోజ్ పెట్టి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి పామును తీసుకుని ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నాడు. పామును గమనించిన వైద్యులు అది రక్తపింజర, కొండచిలువ అనేది తేల్చలేకపోతున్నామని, సరైన వైద్యం చేయలేమని వైద్యులు తేల్చారు. ఏం చేయాలో తెలియక, బంధువుల సూచన మేరకు రాయపర్తి మండలంలోని కొండాపురం గ్రామానికి వెళ్లి నాటు వైద్యం చేసుకున్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్నాడు. కాటు వేసిన చోటచేయి వాపు వచ్చింది. ప్రస్తుతం రాజెల్లు ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న బ్రైడల్ ఫ్యాషన్ షో

- విదేశీయులను ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బ్రైడల్ ఫ్యాషన్ షోలో భారతీయ మహిళలు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):అమెరికా కెంటకీలోని లూయిస్ విల్లేలో శనివారం రాత్రి స్పీడ్ ఆర్ట్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవాస భారతీయుల సాంస్కృతిక ప్రదర్శనలు విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాన్ డీగో మ్యూజియం ఆఫ్ ఆర్ట్ సేకరించిన భారత్‌తో సహా దక్షిణాసియా దేశాలకు చెందిన అత్యంత ప్రాచీనమైన చిత్ర కళాఖండాల గురించి ఆమెరికాలోని చిత్ర కళాభి మానులకు, మ్యూజియం సందర్శకులకు అవగాహన కలిగించడానికి చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్పీడ్ ఆర్ట్ మ్యూజియం హాల్‌లో లూయిస్‌విల్లేలోని ప్రవాస భారతీయులతో ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో 50 మందికిపైగా ప్రవాస భారతీయులు వారి కుటుంబసభ్యులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ప్రధానంగా ప్రవాస భారతీయ మహిళల వధువుల వేషధారణ (బ్రైడల్ షో) విశేషంగా ఆకట్టుకున్నది. భారత దేశంలోని ఆయా రాష్ట్రాల్లో వివాహాల సందర్భంగా ఆ రాష్ట్రాల సంప్రదాయాల ప్రకారం వధువులను అలంకరించే తీరు, వారి వస్త్రధారణ, నగల గురించి తెలియ చేసేఈ ప్రదర్శన ఆద్యంతం విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నది. ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో వధువు ఆ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా అందంగా అలంకరించుకొని వేదికపై నిర్వహించిన క్యాట్ వాక్, మేడ్ ఇన్ ఇండియా పాట నేపథ్యంగా ఇచ్చిన ఈ ప్రదర్శన అబ్బురపరిచింది. అనంతరం సమర్పణ్ నృత్య పాఠశాల ప్రవాస భారతీయ పిల్లలు నిర్వహించిన నృత్య ప్రదర్శన కూడా విశేషంగా ఆకట్టుకున్నది. బ్రైడల్ షోకు లక్ష్మి, దీప్తి కొరియోగ్రాఫర్లుగా వ్యవహరించారు.

పదవులపై పెదవి విరుపు

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోటాలోకి వెళుతుందని అంటున్నారు.

సీనియర్లు, కీలక నేతలకు ఝలక్

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం జరిగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి నామినేటెడ్ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే సీనియర్ నేత బొద్దిరెడ్డి ప్రకార్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, గత ఎన్నికల్లో వర్ధన్నపేట సీటును త్యాగం చేసిన నమిండ్ల శ్రీనివాస్‌తో అనేక మంది సీనియర్లకు నామినేటెడ్ పదవులు వరించకపోవటంపై కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. మరో మహిళ నేత కె.రవళిరెడ్డికి కూడా కీలకమైన పోస్టు దక్కుతుందని భావించినప్పటికీ నిరాశే మిగిలింది. అలాగే భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్‌కు కూడా నామినేటెడ్ పోస్టు దక్కకపోవడం ఆయన వర్గీయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవి ఒక్కరికి కూడా దక్కలేదు. మీసాల ప్రకాష్, నల్లొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితర నేతలు నామినేటెడ్ పోస్టులు వస్తాయనే ఆశతో ఉన్నారు. అలాగే మరో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నుంచి కూడా ఒక్కరికి నామినేటెడ్ పోస్టులు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితర నేతలకు నామినేటెడ్ పదవులు వరిస్తాయని క్యాడర్ భావించినప్పటికీ నిరాశే మిగిలింది. నర్సంపేట, డోర్నకల్, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కకపోవటంతో కేడర్‌లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేలు లేని చోట కూడా..

అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ ఓడిపోయింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ ప్రతినిధులు లేకుండా పోవటంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ నుంచి శనిగపురం ఇందిరకు నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని ఆశించారు. అయితే వీరికి గానీ, వారి అనుచరులకు కానీ నామినేటెడ్ పదవులు దక్కకపోవటంపై నేతలు నారాజ్ అవుతున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఇందిర తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కోణంలో ఇందిరకు ఇవ్వకపోయినప్పటికీ ఇదే నియోజకవర్గానికి చెందిన మరో నేతకు నామినేటెడ్ పోస్టు ఇస్తే ప్రొటోకాల్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇక జిల్లాస్థాయి పదవులే..

రాష్ట్రస్థాయిలో కీలక నామినేటెడ్ పోస్టులు దాదాపు పూర్తి చేశారు. మిగిలిన కొన్ని పోస్టులకు రాష్ట్రస్థాయిలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులపైన నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్‌లాంటి పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించాల్సి ఉంది. వీటితో పాటు కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.




పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

ఏప్రిల్ 24 నుంచి రాష్ట్ర స్థాయి తెలంగాణ హ్యాండ్‌బాల్ టోర్నీ

మట్టెవాడ, మార్చి 17: ఏప్రిల్ 24 నుంచి 27 వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ హంట్ నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ, హ్యాండ్ బాల్ హంట్ టోర్నమెంట్ కెప్టెన్ శ్యామల పవన్‌కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రంగారెడ్డి, తిరుమల, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కుడా' చైర్మన్ ఇనుగాలకు సన్మానం


ఇనుగాలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంగెం, మార్చి 17 : ఇటీవల 'కుడా' చైర్మన్‌గా నియమితులైన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. హైదరాబాద్‌లోని ఇనుగాల ఇంటికి వెళ్లిన నాయకులు ఇనుగాలకు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో సంగెం మండల యూత్ కాంగ్రెస్ ఆగపాటి రాజు, సీనియర్ నాయకులు పులి సాంబయ్య, గుండేటి శ్రీకర్, సంగెం గ్రామ పార్టీ కమిటీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఈటెల ఉమామహేందర్


ఉమామహేందర్‌కు కండువ కప్పుతున్న కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్

మట్టెవాడ, మార్చి 17 : వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు 19వ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర, దేవస్థానం మాజీ డైరెక్టర్ ఈటెల ఉమామహేందర్ ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖమంత్రి కొండాసురేఖ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ సమక్షంలో ఈటెల ఉమామహేందర్ కాంగ్రెస్‌లో చేరారు.

సమస్యలతో సతమతం

కాలనీల్లో కనీస వసతులు లేక అవస్థలు
బెల్టుషాపులు, దొంగలు, పోకిరిల బెడద

ఖిలావరంగల్, మార్చి 17: నగరంలోని శివనగర్, పుప్పాలగుట్ట, రైల్వేస్టేషన్ లైన్, చింతల్ రోడ్డు, ముత్యాలమ్మ దేవాలయం, నాగమయ్య దేవాలయం, జెండా గద్దె, బ్యాంక్ కాలనీ, టీచర్స్‌కాలనీ తదితర కాలనీలలో డ్రెయినేజీ, రోడ్లు, ముళ్లపొదలు, తాగునీరు, చెత్తా, చెదారంతో ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా భారీ గుంతలు తీయడంతో, రోడ్లు అధ్వానంగా మారి శివనగర్ రైల్వేస్టేషన్ దారి, చింతల్, చంద్రవదన కాలనీ తదితర కాలనీల రోడ్డుపై భారీ గుంతలతో ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులు, కనీసం పాదచారులు నడవలేని పరిస్థితి దాపురించింది. తూర్పుకోట, శివనగర్, చింతల్ గుండా స్థంభంపల్లి, వసంతపురం, వంచనగిరి, వెంకటాపురం, దూపకుంట తదితర గ్రామాలకు వెళ్లే రైతులు రాత్రులు అంధకారంతో ఇబ్బంది పడుతున్నారు. రైల్వే మూడోలైన్ ఏర్పాటులో భాగంగా తొలగించిన సిమెంట్ దిమ్మెలను శివనగర్, చింతల్ రోడ్డు పైనే వేయడంతో స్కూల్ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు డీసీఎం, టిప్పర్‌లు, వంటి భారీ వాహనాల రాకపోకలకు అటంకాలు కలుగుతున్నాయి. కాగా, ఆయా ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

రాత్రులు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులను శివనగర్, పుప్పాలగుట్ట, చింతల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను దారికాచి జేబులు ఖాళీ చేస్తున్నారు. అదేమని బాటసారులు ఎదురుతిరిగితే వారిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. శివనగర్, అండర్‌బ్రిడ్జి, రైల్వేస్టేషన్, పుప్పాలగుట్ట, ముత్యాలమ్మదేవాలయం, చింతల్, చింతల్‌బ్రిడ్జి సమీపంలో అనేక బెల్టు షాపులు విచ్చలవిడిగా 24 గంటల పాటు మద్యాన్ని విక్రయించడంతో దొంగలు, పోకిరీలు మద్యం తాగి సెంటర్లలో దారికాచి బాటసారులను దోచుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.


అధ్వానంగా మారిన డ్రెయినేజీ


చెట్టుకొమ్మల నుంచి వెళ్లె విద్యుత్ వైర్లు


చింతల్ రోడ్డుపై వదిలివేసిన స్తంభాలు

నాలుగు రోజులకోసారి తాగునీటి సరఫరా..



శివనగర్, పుప్పాలగుట్ట, జెండా గద్దె, ముత్యాలమ్మ, నాగమయ్య దేవాలయం, బ్యాంక్‌కాలనీ, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాలలో నాలుగు రోజులకోసారి కూడా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. వేసవి కాలం రాకముందే నీటి ఎద్దడి ఏర్పడుతోంది. డివిజన్‌లో కొన్ని కాలనీలకు రోడ్లు పోశారు, మరికొన్ని కాలనీలకు రోడ్లు వేయలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు.

రత్నం మనోహర్, పుప్పాలగుట్ట

అధ్వానంగా రోడ్లు.. డ్రెయినేజీలు



శివనగర్, పుప్పాలగుట్ట, కనీలబావి, ముత్యాలమ్మదేవాలయ, చింతల్‌లో అన్ని రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్‌దీపాలు అధ్వానంగామారాయి. వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలి. అనేక కాలనీల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్టుషాపుల నిర్వహిస్తున్నారు. బెల్టు షాపుల ద్వారా యువత మద్యానికి బానిసై వారి భవిష్యత్తులను నాశనం చేసుకుంటున్నారు.

రాజు, పుప్పాలగుట్ట

పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి : కలెక్టర్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17: వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణితో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, ఎన్నికల నిబంధనలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ ఎస్సీ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల నిబంధనలు రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడరాదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు ఉండకూడదన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎన్నికలకు సంబంధించిన ఉల్లంఘనలు, సందేహాలు ఉంటే సంప్రదించాలని అన్నారు. కంట్రోల్ రూమ్ వివరాలను మీడియా ద్వారా ప్రజలందరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించడం జరుగతుందని, ఎన్నికల నియమావళి ప్రకారం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా ముందుగా సంబంధిత ఏఆర్ఓ, ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రూ. 95 లక్షల వరకు ఖర్చు చేసే పరిమితి ఉందని, ఖర్చు చేసే ప్రతి పైసా ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరిచి అందులో నుంచే ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సువిధ సెల్‌కు లిఖితపూర్వకంగా కనీసం 72 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని అనుమతులు సువిధ యాప్ ద్వారానే జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ శ్రీనివాస్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, ఆర్డీవోలు సిడాం దత్తు, కృష్ణవేణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇవి.శ్రీనివాసరావు, కుసుమ శ్యాంసుందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు భగవద్గీతను పఠించాలి

మట్టెవాడ, మార్చి 17 : సనాతన ధర్మం పునః ప్రతిష్ట చేయడం ద్వారానే సమాజంలో శాంతిభద్రతలు, మానవ జీవనం ఆనందకరంగా సాగుతుందని శివాగురు కల్చరర్ ట్రెస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డి. గోపిచంద్ అన్నారు. ఆదివారం ములుగు రోడ్డు సప్తాదామంలో రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, షీల్డులను అందించారు. గోపిచంద్ మాట్లాడుతూ ధర్మాన్ని ఆశ్రయించేందుకు భగవద్గీత ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో పెద్ది ప్రభాకర్, శ్రీవిద్య, వెంకటరమణ, వసుందర, రామన్న, రవికుమార్, కృష్ణమీనన్, సోమ రామయ్య, మాదారపు సదాశివుడు, సుబ్రహ్మణ్యం, రామసుధాకర్ పాల్గొన్నారు.


పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న గోపి

పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయం

వరంగల్ కల్చరల్, మార్చి 17: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పద్మశాలీల కొరకు ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేయడం హర్షనీయమని తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి మండలి సభ్యులకు వరంగల్ ఉమ్మడి జిల్లా పద్మశాలీల పక్షాన హర్షం, శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా పద్మశాలీలకు ఏర్పాటు చేయడంతోపాటు చైర్మన్ పదవిని కూడా త్వరలోనే నియామకం చేయాలని ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో పద్మశాలీలకు తగిన స్థానం కల్పించాలని ఆయన కోరారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాలిగా సంగీత



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాలిగా కోలెపాక సంగీతను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్వతి సత్యనారాయణ నియమించారు. ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షురాలితోపాటు ప్రధానకార్యదర్శిగా కొండు రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ... జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'నిబంధనల మేరకే ప్రచార సామగ్రి ముద్రించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిర్వహించాలని జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించినప్పుడు లేదా ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేరు, చిరునామా, సెల్‌నెంబరు స్పష్టంగా సూచించాలన్నారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల ప్రచార ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రొఫార్మలో సెక్షన్ 127 ఏ(2) ప్రకారం ప్రచురణకర్త నుంచి డిక్లరేషన్ పొందాలన్నారు. దానిపై ప్రచురణకర్త సంతకం, ఇద్దరు వ్యక్తులచే ధృవీకరించడాలన్నారు.

దీనిని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపే సమయంలో ప్రింటింగ్‌ప్రెస్ యజమాని ధృవీకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ రద్దు చేయడంతోపాటు యజమానిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, రమేశ్, జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

'కార్మిక ఉద్యమంలో లింగమూర్తిది కీలక పాత్ర'


సంతాపసభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

గిర్మాజిపేట,మార్చి17 : ఆజంజాహి మిల్లు, ప్రింటింగ్ వర్కర్స్ తదితర కార్మిక ఉద్యమాల్లో ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు కూరపాటి లింగమూర్తి ది కీలక పాత్రని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్‌లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అధ్యక్షతన కూరపాటి లింగమూర్తి సంతాప సభను నిర్వహించారు. లింగమూర్తి చిత్రపటానికి వెంకటేశ్వర్‌రావు,ఆరెల్లి కృష్ణ తదితరులు నివాళులర్పించారు. వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ నగరంలో వివిధ కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి వారి హక్కుల సాధనకు లింగమూర్తి ఉద్యమాలు చేసి ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడిగా ఎదిగాడన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, మానవ హక్కుల జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు పాల్గొన్నారు.

'పార్టీ ఫిరాయింపులతో విలువలు పతనం'


సమావేశంలో మాట్లాడుతున్న రవి

గిర్మాజిపేట, మార్చి17 : పార్టీ ఫిరాయింపులతో రాజకీయాలలో విలువలు పడిపోతూ, ప్రజల్లో రాజకీయాలపై గౌరవం సన్నగిల్లుతోందని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయంలో ఐతం నగేష్ అధ్యక్షతన జిల్లా సమావేశంలో రవి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో బీఆర్ఎస్ నాయకులు పోటీలు పడుతూ ఫిరాయిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్,బీజేపీలను ఓడించి ప్రజాతంత్ర లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గోనే కుమారస్వామి, పెద్దారపు రమేష్, నర్రప్రతాప్ పాల్గొన్నారు.

భక్తులతో భద్రకాళి దేవాలయం కిటకిట..

వరంగల్ కల్చరల్, మార్చి 17: నగరంలోని శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వారం రోజుల్లో శుక్ర, శని, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తుల రాక కొనసాగుతూనే ఉంది. దాదాపు 10 వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూ లైన్ల ద్వారా సర్వ దర్శనం, ప్రత్యేక దర్శనం ద్వారా ఏర్పాట్లు చేశారు.

దత్తక్షేత్రంలో ..


శ్రీభద్రకాళి అమ్మవారు

నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు కొనసాగాయి. దత్తాత్రేయ స్వామికి ఆలయ అర్చకులు రాపాక గోపీకృష్ణ శర్మ అభిషేకాలను నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనెతో, పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.

కేదారాశ్వేరస్వామి వారికి ప్రత్యేక పూజలు

మడికొండ, మార్చి 17: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మడికొండలోని కేదారేశ్వరస్వామి ఆలయంలో దువ్వ శ్రీకాంత్-సరిత దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్-కవిత దంపతులు, గుర్రం జ్యోతి-అమర్‌నాథ్ దపంతులు, శిరీష, సతీష్, కొత్త క్రిష్ణారెడ్డి, దువ్వ క్రిష్ణ, గోనెల శ్రీధర్, బైరి రజిని, గంగారపు రాజు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక



సమావేశంలో ప్రసంగిస్తున్న కృష్ణమూర్తి

ఖిలావరంగల్, మార్చి17: ఆర్యవైశ్య సంఘం శివనగర్ అధ్యక్షుడిగా మంచాల కృష్ణమూర్తి ఎంపికయ్యారు. ఆదివారం శివనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఎన్నికలను నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా అంచూరి కిషోర్, కోశాధికారిగా అయిత కృష్ణమూర్తి, పరపతి సంఘం అధ్యక్షుడుగా ఉప్పగల్ల అశోక్, కార్యదర్శిగా వంగమల్ల అశోక్, కోశాధికారిగా కూ రగాయల శ్రీనివాస్, వాసవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడుగా ఎన్నంపెల్లి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా రవిందర్, కోశాధికారిగా వేసాల జగదీశ్వర్‌లు ఎన్నికయ్యారు. వీరిని ఆర్యవైశ్య సంఘం శివనగర్ సభ్యులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మాదిగ హక్కుల దండోరా మండల కమిటీ ఎన్నిక


మాదిగ హక్కుల దండోర ప్రతినిధులు

సంగెం, మార్చి 17 : సంగెం మండల మాదిగ హక్కుల దండోరా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా నియమించారు. ఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఆధ్వర్యంలో ఆదివారం మాదిగ హక్కుల దండోరా కమిటీ సమావేశం జరిగింది. మండల కమిటీ అధ్యక్షుడిగా సౌరం విజయ్ కుమార్, మండల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేల్పుల హరీష్, మండల కమిటీ ప్రధాన కార్యదర్శిగా పోలెపాక ప్రేమ్‌నాథ్‌లను నియమించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సౌరం రాజు, పేరాల స్టీవేన్, కరుణాకర్ పాల్గొన్నారు.

గుమాస్తా సంఘం అధ్యక్షుడికి మాతృవియోగం

ఖిలావరంగల్,మార్చి 17: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ గుమాస్తాల సంఘం అధ్యక్షుడు ఇనుముల మల్లేశం తల్లి కొమురమ్మ(65) మృతి చెందారు. ఖిలావరంగల్‌కు చెందిన కొమురమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మృతదేహానికి నివాళులర్పించి, మల్లేశం కుటుంబాన్ని పరామర్శించించారు. అలాగే మార్కెట్ అడ్తిదారులు, గుమాస్తాల సంఘం కమిటీ సభ్యులు, వ్యాపార వర్గాలు మల్లేశంను పరామర్శించారు.

వైభవంగా కొమ్మాల నరసింహునికి అధ్యనోత్సవం


ఆలయంలో అధ్యయనోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

గీసుగొండ, మార్చి 17: కొమ్మాల శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఆలయంలో మొదటి రోజు ఆదివారం రాత్రి అధ్యయనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పండితులు వేదమంత్రాలను అవపోసన పట్టిన తర్వాత నమ్మవార్ల రూపంలో ఆత్మ స్వామివారి విగ్రహంలోకి చేరుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు తెలిపారు. అనంతరం స్వామివారికి నివేదన(ఆరగింపు) చేసి తీర్థప్రసాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు రామానుజాచార్యులు, విష్ణు, సుదర్శనాచార్యులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 18 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

సీఎంను కలిసిన బొంపెల్లి

పర్వతగిరి, మార్చి 17 : మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ బొంపెల్లి దేవేందర్‌రావు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డిని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్‌గా చైర్మన్‌గా నియమించినందుకుగాను ఆయనతో కలిసి సీఎంకు మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



అన్వేష్‌రెడ్డితో కలిసి సీఎంను కలిసిన దేవేందర్‌రావు



వరమ్మతోటలోని మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొంతి

తాగు నీటికి చర్యలు తీసుకోవాలి

నర్సంపేట, మార్చి 17 : ప్రస్తుత వేసవిలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలను తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని వల్లభ్‌నగర్‌లోని వరమ్మతోటలో గల మంచినీటి బావిని, ద్వారకపేట శివారులోని ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు. బావిలో మరమ్మతు పనులు చేపట్టి బావి నీటిని సరఫరా చేసేలా చూడాలని సూచించారు. అలాగే ద్వారకపేట శివారులో నీటిని నిలువ చేసే మాటును పరిశీలించారు. మాటులో పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగించే చర్యలు తీసుకోవడంతో పాటు ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు చేయించి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్. ఎర్ర యాకూబ్‌రెడ్డి. మాజీ వైస్‌ఎంపిపి చింతల సాంబరెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, కౌన్సిలర్లు వేముల సాంబయ్యగౌడ్, ఎలకంటి విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకుడు తుమ్మలపల్లి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

పర్వతగిరి, మార్చి 17 : మండలంలోని చౌటపెల్లి సొసైటీ చైర్మన్ సహా డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ కండువాలను కప్పుకున్నారు. పార్టీలో చేరినవారిలో సొసైటీ చైర్మన్ గొర్రె దేవేందర్, వైస్‌చైర్మన్ మధుసూదన్‌రావు, డైరెక్టర్లు భిక్షపతి, శ్రీనివాస్, రంగయ్య, అమృతరావు, చాంప్లా నాయక్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరినవారిని కంటికిరెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ప్రజాపాలన చూసి ప్రతిపక్షాలు ఓర్చుకోలేకపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ నాయకులు అరవిందరావు, రామారావు, చెవులపెల్లి చలపతిరావు, కనకయ్య, శ్రీనివాస్, నాగార్జున, దేవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా మైస సురేష్



వర్ధన్నపేట రూరల్, మార్చి 17 : వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మైస సురేష్ కుమార్‌ను నియమిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రకటించారు. ఈ మేరకు శనివారం రాత్రి మైస సురేష్‌కు నియమాక పత్రాన్ని అందించారు. పార్టీలో యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా సురేష్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు సిలివేరు శ్రీధర్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఐకేపీ భవన నిర్మాణం

ప్రభుత్వ నిధులు వృథా..

పట్టించుకోని పాలకులు... అధికారులు



అసంపూర్తిగా నిర్మాణం జరిగిన ఐకేపీ భవనం



అరకొర వసతుల భవనంలో ఐకేపీ కార్యాలయం

నెక్కొండ, మార్చి 17 : ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లో ఉంటే అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రభుత్వం లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తుండగా అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా భవనాల నిర్మాణాలతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరక పోగా నిధులు వృథా అవుతున్నాయి. పరిపాలన సౌలభ్యం, మహిళల సౌకర్యార్థం ఆరు సంవత్సరాల క్రితం నెక్కొండకు కిలో మీటర్ దూరంలోని ప్రభుత్వ స్థలంలో మండల సమైక్య భవన (ఐకేపీ) నిర్మాణం చేపట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2016లో రూ.25 లక్షలు భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరీ చేసింది. ఈ నిధులతో నిర్మాణం పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ 2020వరకూ నిర్మాణం పనులు చేశారు. నాలుగు సంవత్సరాలు నిర్మాణం పనులు చేసిన కాంట్రాక్టర్ భవనాన్ని పూర్తిగా నిర్మాణం చేయకుండా అసంపూర్తిగా వదలి వేశారు. స్లాబ్ వేసి భవనం చుట్టూ సగం వరకూ గోడలను నిర్మించారు. 105 ఫీట్ల పొడవు, 35 ఫీట్ల అడ్డం ఉన్న ఈ భవన నిర్మాణం పూర్తి కావాలంటే మరో ఇరవై లక్షల రూపాయల నిధులను మంజూరీ చేయాల్సి వుంది. గతంలో మంజూరీ చేసిన నిధులు సరిపోవడంలేదని అందువల్లనే భవనాన్ని అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేసినట్లు కాంట్రాక్టరు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2016లో నెక్కొండతో పాటు చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లోని ఐకేపీ భవనాల నిర్మాణం పనులను ప్రారంభించారు. అయితే నిధుల సరిపోని కారణంగా మూడు మండలాల్లో భవన నిర్మాణం పనులు నిలిచి పోయాయి. అయితే చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో భవన నిర్మాణాలను పూర్తి చేయడానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సీడీఎఫ్ నిధుల నుంచి రూ.18లక్షల చొప్పున మంజూరి చేయడంతో ఈ రెండు మండలాల్లో భవనాల నిర్మాణం పూర్తిచేశారు. నెక్కొండ మండలానికి మాత్రం నిధులు మంజూరీ చేయిస్తామంటూ మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికి 2023అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిధులు మంజూరీ చేయించలేదు. దీంతో నెక్కొండ ఐకేపీ భవనం అసంపూర్తిగానే మిగిలింది.

నిరాశలో మహిళ సంఘాలు

నెక్కొండ మండలంలో 39గ్రామాల్లో 1250 మహిళ సంఘాలు ఉండగా 14500 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం ఐకేపీ కార్యాలయం చిన్నచిన్న ఇరుకైన రెండు గదుల్లో కొనసాగుతోంది. మహిళలకు సంబంధించిన సమావేశాలు జరిగినప్పుడు ఇతర చోట్లలో ఏర్పాటు చేసుకుంటున్నారు. మహిళా ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం భవన నిర్మాణానికి నిధులను మంజూరీ చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పాలకుల, అధికారుల పట్టింపులేమి కారణంగా భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంతో నిర్మాణ వ్యయం కాస్తా... పెరగడంతో మంజూరైన నిధులతో భవన నిర్మాణం పూర్తికాలేదని మహిళ సంఘాలు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తి చేయించుటకు నిధులను మంజూరీ చేయించాల్సిందిగా మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు...

గ్రామానికి దూరంగా నిర్మాణం జరిగిన ఈ అసంపూర్తి ఐకేపీ భవనం అసాంఘిక కార్యకలాపాలకు, సాధుజంతువులు మేకలు, గొర్రెలు,పశువులకు నిలయంగా మారింది. భవన నిర్మాణం అంసంపూర్తిగా వదలి వేయడంతో పిచ్చి చెట్లతో పూరాతన భవనాన్ని తలపిస్తుంది. ఇదే మార్గంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఈ భవనం ముందునుంచి వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సంబంధితాధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయించాలని కోరుతున్నారు.

సమావేశాల ఏర్పాటుకు ఇబ్బందులు

మార్త లావణ్య, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు



ప్రతీ నెల మహిళ సంఘాల సమావేశాల ఏర్పాటుకు ఇబ్బంది కలుగుతున్నది. సమావేశాల నిర్వహణకు ప్రతీ నెల స్థలాలను వెతుక్కోవాలి. ఇంకా ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే అనేక రకాల కార్యక్రమాలకు సరైన స్థలం లేక పోవడంతో ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకోవడంతో సంఘాలపై ఆర్థిక భారం పడుతోంది. మహిళల ఇబ్బందులను గుర్తించి వెంటనే భవన నిర్మాణం పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలి .

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17 : వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణితో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, ఎన్నికల నిబంధనలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ ఎస్సీ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల నిబంధనలు రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు ఉండకూడదన్నారు. ఓటరు జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందిస్తామని, ఎన్నికల నియమావళి ప్రకారం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా ముందుగా సంబంధిత ఏఆర్‌ఓ, ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేసే పరిమితి ఉందని, ఖర్చు చేసే ప్రతి పైసా ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరిచి అందులో నుంచే ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సువిధ సెల్‌కు లిఖితపూర్వకంగా కనీసం 72గంటల ముం దు దరఖాస్తు చేసుకోవాలన్నారు.అన్ని అనుమతులు సువిధ యాప్ ద్వారానే జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

బిక్కాజిపల్లి మహిళా కాంగ్రెస్ కమిటీ

దుగ్గొండి, మార్చి 17 : మండలంలోని బిక్కాజిపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని ఆదివారం మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వెండి సక్కుబాయి వెల్లడించారు. అధ్యక్షురాలిగా అంగీర్య కురుణ, ఉపాధ్యక్షురాలుగా నల్ల లావణ్య తక్కలపెల్లి రజిత, కార్యదర్శిగా కన్నెబోయిన రమ, సహాయ కార్యదర్శిగా చెల్కలపెల్లి సునీత, కోశాధికారిగా ఇజ్జగిరి సత్య సభ్యులుగా నల్ల రమ, గాదం సరోజన, కొమురమ్మ, బండారి సునీత, ఇజ్జగిరి లత, పోషక్కలు ఎంపికైనట్లు సక్కుబాయి ప్రకటించారు.

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం

నెక్కొండ, మార్చి 17 : మేరు సంఘం ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం నెక్కొండలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆర్థికాభివృద్ధికి ఇప్పటికే 16 కార్పొరేషన్‌లను ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొత్త గణేష్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, నాయకులు రామగిరి సతీష్, కీర్తి అనిల్, ఉప్పలయ్య, నరసింహాస్వామి, సురేష్, రామ్మోహన్, రాజు, రాజేష్, లక్ష్మయ్య, సాయి కుమార్, చందర్, శ్రీకాంత్, రజిత తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనల మేరకే ప్రచార సామగ్రి ముద్రించాలి'

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామ గ్రి ముద్రణకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిర్వహించాలని జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించినప్పుడు లేదా ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేరు, చిరునామా, సెల్‌నెంబరు స్పష్టంగా సూచించాలన్నారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల ప్రచార ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రొఫార్మలో సెక్షన్ 127 ఏ(2) ప్రకారం ప్రచురణకర్త నుంచి డిక్లరేషన్ పొందాలన్నారు. దానిపై ప్రచురణకర్త సంతకం, ఇద్దరు వ్యక్తులచే ధృవీకరించడాలన్నారు.

టెన్త్ విద్యార్థులూ.. భయపడొద్దు

వార్షిక పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలంటున్న నిపుణులు

నల్లబెల్లి, మార్చి 17 : టెన్త్ వార్షిక పరీక్షలు ముంచుకొస్తున్న వేళ టెన్త్ విద్యార్థులు భయం వీడి పరీక్షలను చాలా ప్రశాంతంగా రాయాలని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత వంద శాతం లక్ష్యం కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. పరీక్షల ప్రిపరేషన్‌లో విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు.

మండలంలో 392 మంది విద్యార్థులు

నల్లబెల్లి మండలంలోని మొత్తంగా అన్ని పాఠశాలల్లో 210 మంది బాలికలు, 182 మంది బాలురు కలిపి 392 మంది విద్యార్థులు మార్చి 18న జరగబోయే 10వ తరగతి వార్షిక పరీక్షలను రాయనున్నారు. మండలంలో 10వ తరగతి వార్షిక పరీక్షలను రాయడానికి మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. నల్లబెల్లి ప్రభుత్వ హైస్కూల్ సెంటర్‌లో 98 మంది విద్యార్థులు, రుద్రగూడెం ప్రభుత్వ హైస్కూల్ సెంటర్‌లో 94 మంది విద్యార్థులు, నల్లబెల్లి కారుణ్యజ్యోతి హైస్కూల్ సెంటర్‌లో 200మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని విద్యాశాఖ తెలిపింది. పరీక్షా సెంటర్లలో ఎలాంటి లోటు లేకుండా, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలను రాసే వాతావరణంతో కూడిన సంపూర్ణ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని కూడా మండల విద్యాశాఖ తెలిపింది.



నల్లబెల్లి ప్రభుత్వ బడిలో వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నిపుణుల సూచనలు...

పరీక్షల సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. తాజాగా ఉండే ఆహారం, ఆకుకూరలు, మజ్జిగ లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. వేసవి దృష్ట్యా డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు ఎక్కువగా నీళ్లను తాగాలి. అలాగే పరీక్షల సమయంలో రాత్రంతా మేల్కొని చదివితే నిద్ర సరిపోక చదివిన అంశాలు గుర్తుండవు. సరిపడా నిద్రపోవాలి. పరీక్షల సమయంలో టీవీ, సెల్‌ఫోన్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలి.

ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి

ఎండీ రాయబోస్, జిల్లా చెకుముఖి కన్వీనర్



ఈ నెల 18 నుంచి జరుగబోయే పదో తరగతి వార్షిక పరీక్షలను విద్యార్థులు సానుకూల దృక్పథంతో రాయాలి. సంవత్సరాంతం ఉపాధ్యాయులు చెప్పిన, విద్యార్థులు చదివిన పాఠ్య పుస్తకాల్లోంచే ప్రశ్నలు వస్తాయి. విద్యార్థులు అధైర్య పడకుండా ప్రశాంతంగా ఆలోచిస్తూ, మెదడులో నిక్షిప్తమై ఉన్న అంశాలను ఒకటికి, పదిసార్లు నెమరెసుకోవాలి. ప్రశాంతంగా ఆత్మవిశ్వాసంతో టెన్త్ పరీక్షలను రాయాలి. అప్పుడే వందకు వంద శాతం మంచి ఫలితాలు వస్తాయి. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది.

విద్యార్థులు భయం వీడాలి

అనుగం పద్మజ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, నల్లబెల్లి



మొదట టెన్త్ వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థులు భయం వీడాలి. భయం వీడినప్పుడే విద్యార్థుల ఆలోచన శక్తి పెరుగుతోంది. దీంతో పరీక్షలను సమర్థవంతంగా రాస్తారు. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఇచ్చిన ప్రశ్నలను సరిగ్గా అర్థం చేసుకొని సమాధానాలను రాయాలి. అప్పుడే మంచి గ్రేడ్ వస్తుంది. దీంతో మంచి ఫలితంతో పాటు భవిష్యత్ ఉంటుంది. కావున విద్యార్థులు మీ మేధస్సును ఉపయోగించి పరీక్షలను ధైర్యంగా రాయండి.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఖానాపురం, మార్చి 17 : నేటి నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రత్నమాల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, శాఖాపరమైన అధికారుల నియామకాలను, ఇన్విజిలేటర్ల నియామకాలను జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారన్నారు. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఖానాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 109 మంది విద్యార్థులు, బుధరావుపేట ప్రభుత్వ మోడల్ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 160 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, డ్యూయెల్ డెస్క్‌లు, అందుబాటులో వైద్య వసతి ఏర్పాటు చేశామన్నారు.

పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144సెక్షన్ అమల్లో ఉందని, పరీక్షా కేంద్రా ల సమీపంలో ఉదయంనుంచి పరీక్ష పూర్తయ్యేవరకు జిరాక్స్ కేంద్రాలను తెరవకూడదన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరీక్షల నిర్వహణ అధికారులు ఎవ రూ సెల్ ఫోన్లు వినియోగించకూడదని స్పష్టం చేశారు.

• చెన్నారావుపేట : మండలంలో నేటి నుంచి నుండి నిర్వహిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో రత్నమాల తెలిపారు. మండలంలో మొత్తం 278 మంది విద్యార్థులకు పరీక్షలు రాస్తుండగా వారిలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 129 మంది విద్యార్థులు, అమీనాబాద్ మోడల్ పాఠశాలలో 149 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్ష కేంద్రాలల్లో డీవోలుగా వెంకటరామనర్సయ్య, చంద్రమౌళి, సీఎస్‌లుగా పాపమ్మ, ప్రసన్నలక్ష్మీలు వ్యవహరిస్తారన్నారు.

• రాయపర్తి: నేటి నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు రాయపర్తి ఎంఈవో నోముల రంగయ్య తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలతో పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 450 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది



పార్టీ జెండా గద్దెలకు ముసుగులు కప్పుతున్న జీపీ సిబ్బంది

ఖానాపురం, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ అమల్లోకి రావడంతో ఆదివారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని మహనీయులు, ముఖ్య నాయకుల విగ్రహాలకు, పార్టీల జెండా గద్దెలకు ముసుగులు వేయడంతో పాటు ఫ్లెక్సీలు తొలగించారు. గోడలపై పార్టీల ప్రచార రాతలను తొలిగించారు. కోడ్ నిబంధనల అమలుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనువాస్

చెన్నారావుపేట, మార్చి 17 : తెలంగాణ రాష్ట్రంలో ఎరుకల కార్పొరేషన్ చేయటం హర్షనీయమని ఏకలవ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురి శ్రీనువాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయ పరంగా వెనుకబడిన వర్గాన్ని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం ఎరుకల కులస్థులకు ప్రత్యేక నిధులు కేటాయించటంతో పాటు గ్రామగ్రామన కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణ చేపట్టాలన్నారు. ఎరుకుల సమాజంలో చైతన్యం రావాలన్నారు. ఎరుకల సామాజికవర్గానికి చెందిన వారికి పెద్దపీట వేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛంను అందించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య సంఘం సభ్యులు తిరుపతి, పులిచేరు రాజేందర్, పులిచేరు వెంకటేష్, పల్లకొండ సాంబరాజు, కట్ల రాకేష్ పాల్గొన్నారు.

నూతన ఎస్సైని కలిసిన నాయకులు

చెన్నారావుపేట, మార్చి 17: మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అరుణ్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు గజ్జి రాజు, జిల్లా కార్యదర్శి విజేందర్‌రెడ్డి, జీజీఆర్‌పల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు మిట్టపెల్లి సురేందర్, మండల కార్యదర్శి వేముల నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 : పట్టణ శివారులోని పిరంగిగడ్డ ప్రాంతంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. పలు ద్విచక్ర వాహనాలు, ఆటోలను నిలిపి సరైన వాహనాల పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ముసలయ్య మాట్లాడుతూ వాహనాలు కలిగిన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, సరైన పత్రాలు కలిగి వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాషా, నర్సయ్య, ఏలియా పాల్గొన్నారు.

మైలారంలో చోరీ

• బంగారం, వెండి, నగదు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

రాయపర్తి, మార్చి 17 : గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి, నగదును చోరీ చేసిన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మైలారం గ్రామానికి చెందిన మనుబోతుల ఐలయ్య ఇంట్లో ఎవరులేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా పగలగొట్టి 5తులాల బంగారం, 12తులాల వెండి, రూ.40 వేల నగదను అపహరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఇంటి పరిశీలించి ఆధారాలు సేక రించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాష్ మాట్లాడుతూ బాధితుడు ఇంటికి తాళం వేసి వేరే గ్రామా నికి వెళ్లడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారన్నారు. భాదితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మధు



మధు

నర్సంపేట టౌన్, మార్చి 17 : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్(మెపా)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నర్సంపేట మండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మెపా అభివృద్ధికి ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి, రిజర్వేషన్ సాధన కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



గాయాలపాలైన డ్రైవర్ గంగయ్య

నర్సంపేట టౌన్, మార్చి 17 : ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తాపడగా లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామ శివారులో ఆది వారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మల్లంపల్లి నుంచి నర్సంపేట వైపు వస్తున్న లారీ నర్సంపేట మండ లం ముత్తోజిపేట గ్రామ శివారులోకి రాగానే, ఎదురుగా వచ్చిన స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో లారీ డ్రైవర్ నల్గొండ జిల్లా దామెరకొండ గ్రామానికి చెందిన బిజిలి గంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గంగయ్యను చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.